సాక్షి పార్వతీపురం మన్యం

సోమవారం। 13। మే। 2024



పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు

సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా అన్నారు.

- 8లో



రైతన్నకు ధీమా

అనుకోని విపత్తుల కారణంగా పంట నష్టపోతున్న రైతులను వైఎస్సార్ పంటలబీమా పథకం ఆదుకుంటోంది.

- 8లో



దోచుకోవడమే వారికి తెలుసు..

తెలుగుదేశం పార్టీ పనికి ఆహార పథకంలో, నీరు - చెట్టు పనుల్లో కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ఓటు ఇలా వేయాలి

గరుగుబిల్లి: సార్వత్రిక ఎన్నికల్లో ఓటువేసే విధానంలో ఎన్నికల కమిషన్ పలుమార్పులు తీసుకొచ్చింది. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఓటుహక్కు వినియోగించుకునే విధానాన్ని కూడా మార్చింది. ఓటరు తనకు బీఎల్ఓ అందజేసిన ఎపిక్ కార్డును ఓటింగ్ సమయంలో తీసుకెళ్లాలి. ఈ కార్డులో ఓటరు క్రమసంఖ్య పేరు, ఫొటో చూసుకునే అవకాశం ఉంటుంది. అలాగే ఏదైనా ఒక గుర్తింపుకార్డు తప్పనిసరిగా ఉండాలి. ఓటు కార్డు(ఎపిక్), ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ (ఫొటో ఉన్నది) వంటివి తీసుకువెళ్లాలి.

పోలింగ్‌బూత్‌లలో వినియోగించే పరికరాలివే..

ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్), సీయూ (కంట్రోల్ యూనిట్), వీవీ ప్యాట్ (ఓటరు వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్)లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్‌తో ఓటరుకు పని ఉండదు. దీన్ని ప్రిసైడింగ్ అధికారి(పీఓ) ఆపరేట్ చేస్తారు. ఓటరు ఓటు వేసేందుకు వెళ్లే ముందు సీయూని పీఓ సిద్ధం చేస్తాడు. ఈవీఎంలో ఓటరు ఓటు వేసిన తరువాత తన ఓటు ఎవరికి వేశాడో తెలుసుకునేందుకు వీవీ ప్యాట్‌ను చూడాలి. అప్పుడు మన ఓటు వీవీప్యాట్‌లో ఏడు సెకన్ల పాటు కనిపిస్తుంది. ఓటరు తన ఓటును చూసేందుకు, పారదర్శకంగా ఓటు వేసిన వ్యక్తికి ఎవరికి ఓటును వేశామో రుజువు చేసేందుకు వీవీ ప్యాట్‌ను వినియోగిస్తున్నారు.

చెరగని సిరా

- ఇతరులకు అందుబాటులో ఉండదు
- ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా

పార్వతీపురం: చెరగని సిరా ద్వారా ఓటర్లు వేళ్లపై వారి ఇంటి వద్దే మార్కు చేస్తూ ఓటు హక్కును వినియోగించుకోకుండా చూడాలనే కుట్ర రాష్ట్రంలో జరుగుతోందంటూ సోషల్ మీడియాలో అవుతున్న దుష్ప్రచారాన్ని ఎన్నికల రాష్ట్ర ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా ఆదివారం ఖండించారు. చెరగని సిరా ప్రభుత్వం మాత్రమే తయారు చేస్తుందని, ఈ సిరా భారత ఎన్నికల సంఘం వద్ద మాత్రమే అందుబాటులో ఉంటుందని, మరెవరికీ ఇది అందుబాటులో ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ సిరా భారతీయ ఎన్నికల సంఘం వద్ద కాకుండా ఇతరులు ఎవరికైనా అందుబాటులో ఉంటుందనేది తప్పుడు ప్రచారమన్నారు. ఎవరైనా ఇతర సిరాల ద్వారా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బాసంగిలో కదలని ఏనుగులు



బాసంగిలో ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి ముంపు ప్రాంతంలో ఏనుగులు జలకాలాడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం వరకు ముంపులో ఉండి సాయంత్రానికి అరటి, పామాయిల్ తోటల్లోకి వచ్చి అరటి పంటను ధ్వంసం చేయడంతో రైతులు లబోదిబోమంటు న్నారు. పంట చేతికి వచ్చే సమయానికి ధ్వంసం కావడంతో కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఏనుగులను తరలించే ప్రయత్నం చేయాలని రైతులు కోరుతున్నారు.

చిన్నారిపై కుక్కల దాడి

జియ్యమ్మవలస: మండలంలోని సుభద్రమ్మవలస గ్రామానికి చెందిన ఒకటవ తరగతి చదువుతున్న సుర్ల స్వాతి ఆదివారం ఉదయం గ్రామంలో ఆడుకుంటుండగా ఒక్కసారిగా 5 కుక్కలు దాడిచేసి శరీరమంతా గాట్లు చేశాయి. ఇది గమనించి గ్రామంలో ఉన్న వ్యక్తులు పరుగున వచ్చి వాటిని తరలించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే చిన్నారిని కుక్కలు కిందపడేశాయి. వెంటనే చినమేరంగి హాస్పిటల్‌కు తీసుకువెళ్లి చిన్నారిని కుటుంబసభ్యులు తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం పార్వతీపురం ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.



సుందరంగా తయారైన పార్వతీపురం ప్రధాన రహదారి

అడవి బిడ్డల ఆనంద తాండవం

- ప్రగతిపథంలో పార్వతీపురం మన్యం జిల్లా
- ఆవిర్భవించిన ఇరవై నెలల్లోనే దూసుకెళ్లిన అభివృద్ధి
- రూ.64.25 కోట్లతో పార్వతీపురంలో మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి
- ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణానికి రూ.600 కోట్లు
- సీతంపేటలో రూ.51కోట్లతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి
- వందపడకల ఏరియా ఆస్పత్రిగా 30 బెడ్స్ సీహెచ్‌సీ అప్‌గ్రేడ్
- రూ.190 కోట్లతో కురుపాంలో గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం
- జిల్లా కేంద్రంలో రూ.40 లక్షలతో పార్కుల అభివృద్ధి

రాళ్లూ రప్పలు..వాగులూ వంకలు..చెట్లు..కొండల సహచర్యంతో సంచరించిన అడవిబిడ్డలకు బాహ్య ప్రపంచంతో పెద్దగా పరిచయం అవసరం ఉండేది కాదు. అలాంటి అడవిబిడ్డలు గడిచిన ఐదేళ్లలో తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధితో బాహ్య ప్రపంచంతో పోటీ పడగలుగుతుండడంతో పరవశులై ఆనందరాగం ఆలపిస్తున్నారు. ఒకప్పుడు సక్రమంగా లేని విద్య, వైద్యం, తాగునీరు, రవాణా సౌకర్యం కళ్లముందు దర్శనమిస్తుంటే ప్రభుత్వం తమను గుర్తించి పట్టించుకుని అభివృద్ధి బాట పట్టించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

–పార్వతీపురంటౌన్

ఒకప్పుడు డోలీ మోతలు..అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో రోడ్లు..వైద్యం కోసం వ్యయప్రయాసలు..ఉపాధి కోసం వలసలు..కలిసిరాని వ్యవసాయం..ఇదీ ఉమ్మడి విజయనగరం జిల్లాలో పార్వతీపురం మన్యం ప్రాంతం పరిస్థితి. వైఎస్ రాజశేఖరరెడ్డి తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాంతం దశ దిశా మారిపోయాయి. జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి విజయనగరం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం అసెంబ్లీ నియోజకవర్గ ప్రాంతాలతో పాటు శ్రీకాకుళం జిల్లా నుంచి పాలకొండ అసెంబ్లీ నియోజకవర్గం కలిపి కొత్తగా పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటైంది. పార్వతీపురం మన్యం జిల్లా ఆవిర్భవించిన 20 నెలల కాలంలోనే అభివృద్ధిలో ఎంతో పురోగతి సాధించింది. విద్య, వైద్యం, రహదారులు తదితర మౌలిక సౌకర్యాలు మెరుగుపడడంతో పచ్చని కొండల్లో ప్రగతి పవనాలు వీస్తున్నాయి.

అందుబాటులోకి వైద్యం

అత్యవసర పరిస్థితుల్లో వైద్యం అవసరమైనా, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలకోసమైనా ఒకప్పుడు విశాఖపట్నంలో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకు పరుగు పెట్టాల్సిందే. వ్యయప్రయాసలకోర్చి వెళ్లినా మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అప్పట్లో తరచూ ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దూరదృష్టితో ఇక్కడ ప్రభుత్వ వైద్యసేవలను ఎంతో మెరుగుపరిచారు.



పార్వతీపురం జిల్లా ఆస్పత్రి

మార్పు ఇలా..

- పార్వతీపురం మన్యం జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్మాణానికి రూ.600 కోట్లు మంజూరు
- రూ.64.25 కోట్లతో పార్వతీపురంలో సుమారు 7 ఎకరాల విస్తీర్ణంలో మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- సాలూరులో ఇప్పటికే ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.17 కోట్లతో ఏరియా ఆస్పత్రిగా అభివృద్ధి
- సాలూరు నియోజకవర్గంలో కొత్తగా ఐదు ప్రాథమిక వైద్యకేంద్రాల నిర్మాణం
- రూ.51 కోట్ల వ్యయంతో సీతంపేటలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం
- సీతంపేటలో ఇప్పటికే ఉన్న 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం రూ.20 కోట్ల వ్యయంతో వంద పడకల ఏరియా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్

జిల్లాలో ప్రతిష్టాత్మక గిరిజన వర్సిటీ నిర్మాణం

ఏపీ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం (సీటీయూఏపీ) సొంత భవనాల నిర్మాణ పనులకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఏడాది ఆగస్టు 25న భూమిపూజ చేశారు. గిరిజన ప్రాంతానికి చేరువగా, గిరిజన ప్రగతికి దిక్సూచిగా సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మెంటాడ మండలం చినమేడపల్లి, విజయనగరం జిల్లా గజపతినగరం నియోజకవర్గం పరిధిలోని దత్తిరాజేరు మండలం మర్రివలస గ్రామాల సరిహద్దులో దీన్ని నిర్మిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 2014వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి మంజూరు చేసిన ఈ కేంద్రీయ విద్యాసంస్థ కోసం 2019 ఏప్రిల్ వరకూ అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రభుత్వం ఏమీ చేయలేక చేతులెత్తేసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే విజయనగరం పట్టణ శివారు కొండకరకాం వద్దనున్న ఆంధ్రా విశ్వవిద్యాలయం పీజీ క్యాంపస్ భవనంలో 2019 ఆగస్టు 5న సీటీయూఏపీ తరగతులు ప్రారంభమయ్యాయి.

నిధుల కేటాయింపు

సీటీయూఏపీ కోసం బడ్జెట్‌లో రూ.834.83 కోట్లు

కేటాయించిన భూమి:519.03 ఎకరాలు

నిర్మాణం పూర్తి చేయడానికి లక్ష్యం:42 నెలలు

మౌళిక వసతుల కల్పనకు రూ. 23.60కోట్లు



సీతంపేట మల్టీ స్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం



పాలకొండలో అభివృద్ధి ఇలా...

- రూ. 5కోట్లతో వీరఘట్టం రహదారి విస్తరణ
- భామిని మండలంలో ఒడిశా సరిహద్దు ప్రాంతమైన బత్తిలివద్ద రూ.
- 4.25కోట్లతో జిల్లాలో ప్రథమ మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం
- వంశధార ప్రధాన ప్రాజెక్టుకు పిల్ల కాలువల ద్వారా సాగునీరు అందించేందుకు నిధుల మంజూరు



జిల్లాలో సంక్షేమం ఇలా..		
సంక్షేమ పథకం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి (రూ.కోట్లలో)
రైతు భరోసా	1,45,954	రూ.856.37కోట్లు
ఆక్వా రైతుల సంక్షేమం	4,322	రూ.2.73కోట్లు
జగనన్న అమ్మ ఒడి	83,733	రూ.493.28కోట్లు
వైఎస్సార్ చేయూత	77,995	రూ.523.64కోట్లు
వైఎస్సార్ ఆసరా	1,88,072	రూ.282.79కోట్లు
వైఎస్సార్ పింఛన్ కానుక	1,45,291	రూ.491.89కోట్లు
నవరత్నాలు,పేదలకు ఇల్లు	27,242	రూ.276.32కోట్లు
జగనన్న విద్యాదీవెన	20,306	రూ.23.42కోట్లు
జగనన్న వసతి దీవెన	17,172	రూ.15.84కోట్లు
వైఎస్సార్ కల్యాణమస్తు	1700	రూ.11.84కోట్లు

జిల్లా కేంద్రానికి సొబగులు

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం సంకల్పించింది.



పార్వతీపురం కలెక్టరేట్

- సన్యాసిరాజు స్మారక పార్కు రూ. 40 లక్షలతో అభివృద్ధి
- పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు, విద్యార్థులకు సంబంధించి క్రీడలకు ఉపయోపడేలా అభివృద్ధి
- కొత్తవలస శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో క్రీడాసౌకర్యాలతో మైదానం రూపురేఖల మార్పు
- అమృత్ సరోవర్ పథకం ద్వారా చెరువుల అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ నిర్మాణం
- పాతబస్టాండ్ నుంచి ఫ్లైఓవర్ వరకు రూ. 2కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణం
- రూ.40 లక్షలతో పార్కుల అభివృద్ధికి
- రూ.2 కోట్లతో రహదారుల అభివృద్ధి
- రూ. 64.25కోట్లతో మల్టీస్పెషాల్టీ ఆస్పత్రి నిర్మాణం
- ప్రభుత్వమెడికల్ కళాశాలకు రూ.600కోట్లు మంజూరు
- పట్టణ పరిశుభ్రతకు 10 క్లాప్ వాహనాలు

గడపగడపకు మన ప్రభుత్వంలో పనులు		
ప్రతిపాదిత పనులు	:	1766
అంచనా వ్యయం	:	రూ. 44.73కోట్లు
పూర్తయినవి	:	856
పురోగతిలో ఉన్నవి:	:	910
ప్రాధాన్యతా భవనాల నిర్మాణం		
గ్రామసచివాలయాలు	:	311
రైతు భరోసా కేంద్రాలు	:	301
వైఎస్సార్ హెల్త్ సెంటర్లు	:	192
డిజిటల్ లైబ్రరీలు	:	85 మంజూరు
బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు	:	19
ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యం		
ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	:	37
అందుబాటులో ఉన్న వైద్యులు	:	83
యూపీహెచ్‌సీలు	:	5
సీహెచ్‌సీలు	:	3
108 వాహనాలు	:	17
104 వాహనాలు	:	31
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్	:	16
ఏఎన్ఎంలు	:	730మంది
ఎస్ఎన్‌సీయూ యూనిట్లు	:	3
జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు	:	292
ప్రయోజనం పొందిన వారు	:	1,29,191 మంది
సాంకేతిక విప్లవం		
గిరిజన ప్రాంతాల్లో 4జీ టవర్లు		
సెల్‌ఫోన్ సిగ్నల్ వచ్చిన గ్రామాలు	:	190
నిర్మాణంలో ఉన్న టవర్లు	:	47
నిర్మాణం పూర్తయిన టవర్లు	:	73

జిల్లా ఏర్పాటైన అనతి కాలంలోనే అభివృద్ధి పరంగా జరుగుతున్న పనులు, సంక్షేమ లబ్ధి ఎవరి వల్లనైతే సాకారమైందో గుర్తించి.. భవిష్యత్తులో మరింత అభివృద్ధిని చేయగలిగే వ్యక్తులను ఈ ఎన్నికల్లో ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

కురుపాంలో అభివృద్ధి వెలుగులు



నిర్మాణంలో ఉన్న కురుపాం గిరిజన కళాశాల

- గిరిజన విద్యార్థుల ప్రయోజనానికి కురుపాంలో 105 ఎకరాల విస్తీర్ణంలో రూ. 190కోట్ల నిధులతో ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం
- రూ. 44.9కోట్లతో రావాడ, వట్టిగెడ్డ అభివృద్ధి
- రూ. 12కోట్లతో సీహెచ్‌సీ ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం
- రూ. 143కోట్లతో తాగునీటి సౌకర్యం
- ఆర్‌అండ్‌బీ విభాగంలో రూ.11.5కోట్లతో 23 రహదారులు
- ఇంజినీరింగ్ విభాగంలో రూ. 28కోట్లతో 21రోడ్లు
- పంచాయతీ రాజ్ విభాగంలో రూ. 82.5కోట్లతో 21 రోడ్ల నిర్మాణం
- నాడు-నేడులో రూ.4.9కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి
- తోటపల్లి దేవస్థానం అభివృద్ధికి రూ. 80లక్షలు
- రూ. 12కోట్లతో కురుపాం ఏకలవ్య మోడల్స్ స్కూల్ అభివృద్ధి
- రూ. 8.7కోట్లతో కురుపాం గురుకుల పాఠశాల అభివృద్ధి భవన నిర్మాణం

సాలూరులో ప్రగతి పరుగులు



బత్తిలి మోడల్ పోలీస్‌స్టేషన్

- పట్టణంలో రూ.4.30కోట్ల అంచనా వ్యయంతో మోడల్ పోలీస్‌స్టేషన్ నిర్మాణం
- పాచిపెంట మండలంలో పెద్దగెడ్డ జలాశయం రూ. 28.02కోట్ల జైకా నిధులతో అభివృద్ధి
- మక్కువ మండలంలో వీఆర్ఎస్ జలాశయానికి రూ. 63కోట్లు
- మెంటాడ మండలంలో ఆంధ్ర జలాశయానికి రూ.3కోట్ల ఖర్చులతో సాగునీటి ఇబ్బందుల పరిష్కారం
- సాలూరు పట్టణంలో రూ. 38కోట్లతో బైపాస్ నిర్మాణం
- తాగునీటి సరఫరా మెరుగుకు రూ.68.98కోట్ల వ్యయం
- ఆర్‌అండ్‌బీ విభాగంలో రూ.152.5 కోట్లతో 55 రోడ్ల పనులు
- ఇంజినీరింగ్ విభాగంలో రూ. 153. 37కోట్లతో 536 నిర్మాణ పనులు
- పంచాయతీ రాజ్ విభాగంలో రూ. 87.10కోట్లతో 2,720 పనులు పూర్తి
- రూ. 113. 95 కోట్లతో ఇంజినీరింగ్ పనులు

ఓటు వేద్దాం రా..!



- నేడే లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు
- ఉదయం 7 నుంచి పోలింగ్ ప్రారంభం
- ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం
- 1,031 కేంద్రాలకు తరలించిన ఎన్నికల సామగ్రి

సాక్షి, పార్వతీపురం మన్యం:

ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే పౌరులు తమ బాధ్యత తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓ పౌరుడా..ఆలోచించు. నీకు ఎవరు మంచి చేశారో.. చెప్పిన హామీలను ఎవరు మాట తప్పకుండా నెరవేరుస్తారో..నీ భవిష్యత్తుకు ఎవరు బాటలేస్తారో విజ్ఞతతో యోచించి ఓటు వెయ్యి. పద..పోలింగ్ బూత్‌కు..ఓటు అనే నీ ఆయుధంతో సుపరిపాలనకు ఓటు వెయ్యి. విశ్వసనీయతకు పట్టం కట్టు.

ఉదయం 7 గంటల నుంచి పోలింగ్



పోలింగ్ సామగ్రిని తరలిస్తున్న సిబ్బంది

లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికల సంగ్రామం ఈ రోజే. మరికొద్దిసేపట్లో పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. జిల్లాలోని పార్వతీపురం నియోజకవర్గంలో సోమవారం ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మిగిలిన కురుపాం, పాలకొండ, సాలూరు నియోజకవర్గాల్లో సాయంత్రం 5 గంటలతో ముగుస్తుంది. పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో సాయంత్రం 4 గంటలతో పోలింగ్ ముగియనుంది. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులూ లేకుండా పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, షామియానాలు, కుర్చీలు వంటి సౌకర్యాలు కల్పించారు. ఇప్పటికే మన్యం జిల్లా పరిధిలో 579 మంది వృద్ధులు, దివ్యాంగులు హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాకు చెందిన 9,258 మంది ఉద్యోగులు, ఇతర జిల్లాలకు చెందిన 1,199 మంది ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. సర్వీసు ఓట్లు 133 అందాయి.

443 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్

జిల్లాలో మొత్తం 1,031 పోలింగ్ కేంద్రాలున్నాయి. వాటిలో సాధారణ కేంద్రాలు 883 కాగా..క్రిటికల్ కేంద్రాలు 219. మొత్తం 443 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేంద్రాలను సీసీ కెమెరాల ద్వారా సూక్ష్మ పరిశీలకులు, ఇతర అధికారులు పర్యవేక్షిస్తారు. జిల్లాలో 144 సెక్టార్లు, 151 రూట్లను ఏర్పాటు చేశారు.

ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో మొత్తం 7,83,440 మంది ఓటర్లు ఉండగా..వారిలో 3,82,589 మంది పురుషులు, 4,00,779 మంది మహిళలు, 72 మంది ఇతరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది

ఎన్నికలకు దాదాపు 6,600 మంది సిబ్బందిని, 127 మంది సూక్ష్మ పరిశీలకులను నియమించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ ఆదివారం ఉదయం ప్రారంభమైంది. పార్వతీపురం, పాలకొండ, కురుపాం నియోజకవర్గాలకు సంబంధించి ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోనూ, సాలూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనూ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అధికారులు, సిబ్బంది ఉదయం 7 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకున్నారు. తమకు కేటాయించిన సామగ్రిని తీసుకుని సాయంత్రం 4 గంటల తర్వాత ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో ఆయా మండలాలకు ప్రయాణమయ్యారు. రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూంలను తెరిచి ఈవీ ఎంల పంపిణీని ప్రారంభించారు. సిబ్బందికి సెక్టార్, రూట్ వారీగా బస్సులు ఏర్పాటు చేసి బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు పంపించారు. ఎన్నికల అనంతరం ఈవీఎంలను జిల్లాకేంద్రం పార్వతీపురంలోని ఉద్యాన కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు పటిష్ట బందోబస్తు మధ్య తరలిస్తారు.

కొటియా గ్రామాలపైనే అందరి దృష్టి

ఆంధ్రా-ఒడిశా సరిహద్దు కొటియా గ్రూప్ గ్రామాలపైనే అందరి దృష్టి పడింది. ఇక్కడ 22గ్రామాలుండగా..అక్కడి ప్రజలకు ఇటు ఆంధ్రాలోనూ, అటు ఒడిశాలోనూ ఓటు హక్కు ఉంది. ఇరు రాష్ట్రాలకూ ఒకే రోజు పోలింగ్ జరగనుంది. రాష్ట్రం నుంచి జిల్లా యంత్రాంగం రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నేరెళ్లవలసలో ఒక కేంద్రం ఉండగా..గంజాయిభద్ర, డెస్పరాయి, సంపంగిపాడు ప్రాంతాలకు చెందిన సుమారు 839 మంది ఓటర్లు ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. శిఖపరువులో మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ 1028 మంది ఓటర్లున్నారు. పట్టుచెన్నూరు, పగులుచెన్నూరు ప్రాంత ఓటర్లకు అనుకూలంగా ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేశారు. ఏపీ పరిధిలో ఉన్న ఓటర్లను గతంలో ఒడిశా అధికారులు ఓటు వేయకుండా అడ్డుకున్న ఉదంతాలున్నాయి. ఇటువంటి పరిస్థితులు తలెత్తకుండా ముందుగానే ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంతవరకు సఫలీకృతమవుతుందో చూడాలి.

క్లుప్తంగా

మద్యంతో పట్టుబడిన టీడీపీ కార్యకర్త


పట్టుబడిన మద్యం సీసాలతో సీఐ సురేష్, సిబ్బంది

భోగాపురం: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపరిచేందుకు తెలుగుదేశం, జనసేన కూటమి నాయకులు ఆదివారం మద్యం సీసాలు పంపిణీ చేశారు. మండలంలోని సవరవిల్లిలో ఓటర్లకు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసిన 45 మద్యం సీసాలతో టీడీపీ కార్యకర్త బర్ల గురుమూర్తి పట్టుబడ్డాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.సురేష్ తెలిపారు.

1032 మద్యం బాటిళ్లు..


రాజాం సిటీ: స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ సిబ్బంది

రాజాం సిటీ: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జరిపిన దాడుల్లో 1032 మద్యం బాటిళ్లను పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ బి.శ్రీధర్ తెలిపారు. సంతకవిటి మండలం తాలాడ సమీపంలో 574 మద్యం బాటిళ్లు.. వంగర మండలం అరసాడ సమీపంలో 76.. రేగిడి మండలం బూరాడ సమీపంలో 380 బాటిళ్లు పట్టుకున్నామన్నారు. అలాగే ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వివాహిత ఆత్మహత్య

గజపతినగరం రూరల్: మండలంలోని కెంగువ గ్రామం యాతపేటకు చెందిన ఎర్ర చిన్న (33) ఆదివారం సాయంత్రం ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం. మృతురాలికి భర్త రాముతో ఎప్పటికప్పుడు తగదాలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన చిన్న ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చినశిర్లాంలో వ్యక్తి హత్య



హత్యకు గురైన సంగం (ఇన్‌సెట్లో) సంగం (ఫైల్)

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాతత ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. చిన్నశిర్లాం దళితవాడలో నివాసం ఉంటున్న ఉత్తరావల్లి సంగం (65) తన ఇంటి ముందు నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు నిద్రిస్తున్న సంగం గొంతును కత్తితో కోశారు. కొద్దిసేపటికి గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని రాజాంలోని ఓ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఇతనికి భార్య నక్షత్రమ్మ, కుమారులు కిషోర్, కిరణ్ ఉన్నారు. సంఘటనా స్థలానికి చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్ చక్రవర్తి, ఎస్సై ఇ.శ్రీనివాస్ చేరుకుని కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ హత్యకు రాజకీయానికి ఎటువంటి సంబంధం లేదని పోలీసులు వెల్లడించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ప్రశాంతంగా ఎన్నికలు..


పోలింగ్ కేంద్రాల వివరాలపై ఆరాతీస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆమె ఆదివారం పరిశీలించారు. సోమవారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఓటింగ్ జరిగేలా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలు, రూట్‌ల వివరాలను ఆర్వో ఎల్.జోసెఫ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లోని సదుపాయాలపై ఆరాతీశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹153	₹276	₹286

పక్కాగా ఎన్నికల ఏర్పాట్లు

- సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా


ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా

పార్వతీపురం: సాధారణ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఎన్నికల పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన పార్వతీపురంలోని డా. వైఎస్ఆర్ ఉద్యాన కళాశాలలో ఎన్నికల సామగ్రి స్వీకరణ రిసెప్షన్ కేంద్రానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ నిషాంత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాం నియోజక వర్గాలకు వేరువేరుగా కేటాయించిన శిబిరాలలోని కౌంటర్ల వద్ద టేబుల్స్, కుర్చీల ఏర్పాటును, పోలింగ్ అనంతరం పీఓలు, ఏపీఓల స్ర్కూటినీ, స్వీకరణకు కల్పించిన వసతులు, తదితర అంశాల ఏర్పాట్లపై కలెక్టర్ ఆయనకు వివరించారు. అలాగే లెక్కింపు కేంద్రాల వద్ద బారికేడ్లు, గోడలకు మెస్ ఏర్పాటును నిశితంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బందికి ఆహారం అందించేందుకు ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు శిబిరాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల సామగ్రి స్వీకరణ సజావుగా, ప్రశాంతంగా జరిగేలా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. గాలి, వెలుతురు, తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. టాయిలెట్స్ నిర్మాణాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రతా, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన సీసీ కెమెరాల పనితీరును వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర నిఘా, పర్యవేక్షణ కోసం వసతి కల్పన చూశారు.

బస్‌ల రాకపోకలకు అంతరాయం లేకుండా..

స్ట్రాంగ్ రూమ్ వద్దకు సులువుగా చేరుకునేలా రాకపోకలకు అంతరాయం కలగకుండా కళాశాల ముందు భాగంలో బస్‌ల పార్కింగ్‌కు అనువుగా స్థలాన్ని సిద్ధం చేసినట్లు కలెక్టర్ ఆయనకు తెలిపారు. బస్సులు నడిపేందుకు ఎక్కడా ఇబ్బంది లేకుండా రిసెప్షన్ కేంద్రానికి వచ్చేందుకు, వెళ్లేందుకు మార్గాలను సూచించినట్లు కలెక్టర్ వివరించారు. అనంతరం ఆయన ఎన్నికలకు కేటాయించిన ప్రతి విభాగాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్. శోభిక, కంట్రోల్ రూమ్ ఎస్‌డీసీ ఆర్.సూర్యనారాయణ, డ్వామా పీడీ కె.రామచంద్ర రావు, డీఆర్‌డీఏ పీడీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, విద్యుత్ శాఖ ఇంజినీరింగ్ అధికారి పి.త్రినాథ రావు, డీపీహెచ్ఈఓ కేజీఎస్.నరసింగరావు, రోడ్లు భవనాల శాఖ ఇంజినీరింగ్ అధికారి ఎస్.వేణుగోపాల్ రావు, పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముచ్చర్లవలస గ్రామానికి చెందిన బొడ్డు జగన్ మోహనరావు(48) ఆరికతోట నుంచి తన ద్విచక్రవాహనంపై సొంత గ్రామానికి వస్తుండగా.. ఆరికతోట వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. దీంతో జగన్ మోహనరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్సై జ్ఞానప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎన్నికల సామగ్రి తరలింపు పూర్తి


ఎన్నికలకు హాజరుకానున్న పోలీస్ సిబ్బంది


పంపిణీ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ హేమలత


సామగ్రిని తీసుకువెళ్తున్న సిబ్బంది

పార్వతీపురంటౌన్: నేడు జరగనున్న ఎన్నికల నిర్వహణకు సామగ్రి తరలింపు పూర్తయింది. ఈ మేరకు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలకు ఆదివారం ఉదయం చేరుకున్నారు. తమకు ఎక్కడ నియామకం జరిగిందో తెలుసుకుని నియామక పత్రాలు అందుకుని, అనంతరం తమ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన సామగ్రిని స్వీకరించారు. పార్వతీపురం నియోజకవర్గంలలో 33 సెక్టార్‌లు ఏర్పాటు చేశారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి పార్వతీపురం నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల వద్ద ఈవీఎంల పంపిణీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఉదయం 6:30 గంటలకు ఎన్నికల పరిశీలకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి హేమలత స్ట్రాంగ్ రూమ్‌లను తెరిచి ఈవీఎంల పంపిణీ ప్రారంభించారు. ఈవీఎం పంపిణీ ప్రక్రియను నిర్విఘ్నంగా పూర్తి చేశారు. సిబ్బందికి సెక్టార్, రూట్‌వారీగా బస్సులు ఏర్పాటు చేసి బందోబస్తుతో పోలింగ్ కేంద్రాలకు పంపించారు. కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి, అరకు పార్లమెంట్ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి నిషాంత్‌కుమార్ జిల్లావ్యాప్తంగా ఎన్నికల సామగ్రి తరలిపు ప్రక్రియను పర్యవేక్షించారు. జాయింట్ కలెక్టర్, అరకు పార్లమెంట్ నియోజకవర్గం సహాయ రిట ర్నింగ్ అధికారి ఎస్ఎస్ శోభిక పర్యవేక్షణ చేసి అన్ని సజావుగా ఏర్పాటు చేశారు. సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లను చేశారు. పోలింగ్ కేంద్రాల్లో సైతం ఎటువంటి ఇబ్బందు లు తలెత్తకుండా ఆహార, వసతి సౌకర్యాలతో సహా అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం జరగనున్న పోలింగ్ సందర్భంగా ఉదయం ఏజెంట్ల సమక్షంలో నమూనా ఓటింగ్ నిర్వహించి ఏడు గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తారు. పార్వతీపురం నియోజకవర్గంలో 1,89,817 మంది ఓటర్లు ఉన్నారు.

వైఎస్సార్ పంటల బీమాతో.. రైతన్నకు ధీమా

- ఐదేళ్ల కాలంలో 37,487 మంది రైతులకు రూ.33.08 కోట్ల చెల్లింపు
- పంట నష్టం జరిగిన వెంటనే బీమా చెల్లింపు
- రైతుల తరఫున బీమా ప్రీమియం చెల్లిస్తున్న ప్రభుత్వం





విజయనగరం ఫోర్ట్: పక్క ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు ఇజ్జాడ హనుమంతురావు. ఇతనిది బొండపల్లి మండలం జె. గుమడాం రెవెన్యూ పరిధిలోని కొవ్వాడపేట గ్రామం. 2021 ఖరీఫ్‌లో రెండెకరాల వరకు అరటిపంట సాగు చేశాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా అరటిపంట దెబ్బతింది. దీంతో ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా పథకం కింద ఇతని బ్యాంక్ ఖాతాలో రూ.27,100 ప్రభుత్వం జమ చేసింది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు పేరు కొవ్వాడ కొండలరావు. ఇతనిది బొండపల్లి మండలం కొవ్వాడ పేట గ్రామం. 2021 ఖరీఫ్‌లో ఎకరం పొలంలో అరటి పంట సాగు చేసాడు. వర్షాభావ పరిస్థితుల వల్ల అరటిపంట దెబ్బతింది. దీంతో వైఎస్సార్ పంటల బీమా కింద అతని ఖాతాలో రూ. 14,577 జమైంది.

2019 నుంచి 2022 వరకు ప్రభుత్వం చెల్లించిన పంటల బీమా వివరాలు

సంవత్సరం	రైతులు	పంటలబీమా మొత్తం రూ. కోట్లలలో
2019	3,183	రూ.2,52,62,329
2020	24,625	రూ.20,68,99,051
2021	9,361	రూ.9,36,49,299
2022	324	రూ.50,14,290

అనుకోని విపత్తుల కారణంగా పంట నష్టపోతున్న రైతులను వైఎస్సార్ పంటలబీమా పథకం అదుకుంటోంది. గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రకృతి వైపరీత్యాలు పెద్దగా సంభవించలేదు. ఒకటి రెండు చోట్ల ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగినా వాటికి ప్రభుత్వం పరిహారం చెల్లించింది. రైతు సంక్షేమం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సాగు పెట్టుబడి కోసం వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా ఏటా రూ. 13,500 సాయాన్ని అందిస్తోంది. అదేవిధంగా రైతుభరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే అందజేస్తోంది. అదేవిధంగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పంట నష్టపోయిన రైతులను అదుకోవడం కోసం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ పంట బీమా పథకాన్ని అమలు చేస్తోంది.

ఉచిత బీమా..

దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో మాత్రమే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. బీమాకు చెల్లించాల్సిన ప్రీమియం సొమ్మును కూడా రైతుల తరఫున ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇందుకు గాను ఏటా రూ. 13 కోట్లు వెచ్చిస్తోంది. పంట సాగు చేసిన రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకుంటే చాలు పథకానికి అర్హత ఉన్నట్లే.

రూ. 33.08 కోట్లు చెల్లింపు..

జిల్లాలో 2019 నుంచి ఇప్పటివరకు పంట నష్టపోయిన 37,497 మంది రైతులకు రూ.33.08 కోట్లు పంటల బీమా పథకం కింద ప్రభుత్వం చెల్లించింది. వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలకు ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా అమలు చేస్తోంది. జిల్లాలో వరి పంట 93 వేల హెక్టార్లలోను, మొక్కజొన్న 15 వేల హెక్టార్లలోను, ఉద్యానవన పంటలు 60 వేల హెక్టార్లలో సాగవుతున్నాయి.

గతంలో రైతులే చెల్లించేవారు..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తాము సాగు చేసిన పంటలకు రైతులే బీమా ప్రీమియం చెల్లించేవారు. ఒక్కో రైతు రూ.2 వేల నుంచి 4 వేల రూపాయల వరకు రైతులే చెల్లించేవారు. ఇది అదనపు భారమే అయినా గత్యంతరం లేక రైతులే చెల్లించేవారు. కాని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల నుంచి ఒక్క పైసా తీసుకోకుండా ప్రభుత్వమే చెల్లిస్తోంది.

కచ్చితమైన నివేదికలివ్వాలి..



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలను కచ్చితమైన వివరాలతో వేగంగా అందజేయాలని జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ఎన్నిక రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ'పై ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి నాగలక్ష్మి మాట్లాడుతూ.. కేంద్రాల వద్ద ఎలా ఓటు చేయాలి, తదితర వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ రోజు ఇచ్చే నివేదికలు ఎంతో కీలకమని, కచ్చితమైన సమాచారంతో అందజేయాలని సూచించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రతి రెండు గంటలకు ఓటింగ్ శాతాన్ని తీసుకోవాలని.. పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఈ వివరాలు అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌డీఏ అనిత, ఎన్నికల రోజు మేనేజ్‌మెంట్ వ్యవస్థ ఇన్‌చార్జ్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


హాజరైన ఎన్నికల నిర్వహణ అధికారులు, సిబ్బంది

వెబ్ కాస్టింగ్‌ను పరిశీలించిన కలెక్టర్

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి ఆదివారం రాత్రి పరిశీలించారు. జిల్లాలోని 362 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో సహా మొత్తం 1,136 కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. దీని కోసం 2,272 సీసీ కెమేరాలను అమర్చారు. వీటి ద్వారా ఆయా కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నుంచే పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియ ఆదివారం సాయత్రానికే ప్రారంభమైంది.

దోచుకోవడమే వారికి తెలుసు..

- నీరు – చెట్టు, సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల కాంట్రాక్ట్‌లు టీడీపీ కార్యకర్తలకే
- ఇంకుడు గుంతలు, నాడెప్ కుండీల నిర్మాణాల్లోనూ చేతివాటం
- రూ. కోట్లు వెనకేసుకున్న టీడీపీ నేతలు


నీరు - చెట్టు పనుల్లో అరకోటికి పైగా అవినీతి జరిగిన రాకోడు వెంకునాయుడు చెరువు (ఫైల్)

విజయనగరం రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న కాలంలో (2004 ముందు వరకు) పనికి ఆహార పథకంలో పందికొక్కులా నిధులు మింగేసిన ఆ పార్టీ నేతలు 2014 - 2019 మధ్య కాలంలో మరోసారి అధికారం రావడంతో నీరు - చెట్టు పనుల్లో కోట్లాది రూపాయలు వేనకేసుకున్నారు. తెలుగు తమ్ముళ్లకు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అన్ని విధాలా న్యాయం చేయాలని భావించిన చంద్రబాబునాయుడు తన పాలనా కాలంలో సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాల ద్వారా వారికి లబ్ధి చేకూర్చే పనులనే అప్పగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరైన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల నిధులను మింగేయడానికి జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేశారు. దీంతో ఐదేళ్ల టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు ప్రజల రక్తాన్ని పీల్చేశాయి. మరోసారి వారికి అధికారం అప్పగిస్తే జన్మభూమి కమిటీలకు మించి ప్రజలను మింగేయడానికి సిద్ధమైపోతారని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జిత్తులమారి చంద్రబాబును మరోసారి నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేమని ప్రజలు చెబుతున్నారు.

నీరు – చెట్టు పనుల్లో దోచేశారిలా...

విజయనగరం నియోజకవర్గంలో 2014–15 సంవత్సరం నుంచి నీరు – చెట్టు కార్యక్రమాన్ని ఒక యజ్ఞంలా నిర్వహించిన తెలుగుదేశం ప్రభుత్వం నియోజకవర్గంలోనే చేయని పనులకు కోట్లాది రూపాయలను మింగేసింది. దీంతో పాటు చెరువుల్లో మట్టిని తవ్వి అమ్ముకొని లక్షలాది రూపాయలను దోచేశారు.

మట్టితో వ్యాపారం

చెరువుల్లో మట్టిని తీసి రైతుల పొలాలకు తరలించడానికి క్యూబిక్ మీటరుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 29 లు చెల్లించగా.. చెరువు గట్లు పటిష్టానికి, శ్మశానవాటికలు, ప్రభుత్వ కార్యాలయాలకు తరలించడానికి క్యూబిక్ మీటర్‌కు రూ. 82.80 చెల్లించింది. అయితే టీడీపీ నాయకులు ప్రభుత్వ ఖర్చుతో తీసిన మట్టిని రియల్ ఎస్టేట్ స్థలాలకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఒక్కో లారీ లోడుకు రూ. 400 నుంచి వెయ్యి రూపాయల వరకు వసూలు చేశారు. 2015 నుంచి 2019 మధ్య కాలంలో నీరు - చెట్టు పనులు 145 చేయగా రూ. 9.40 కోట్లకు పైగా బిల్లులు చెల్లించారు. వీటిలో చేసిన 63 పనులనే మళ్లీ చేసినట్లు చూపి కోట్ల రూపాయల నిధులను తెలుగుదేశం పార్టీ నేతలు దోచేశారు.

నాడెప్ కుండీల నిధులు టీడీపీ నేతల జేబుల్లోకి..

విజయనగరం మండల పరిధిలో 2016 - 17 సంవత్సరంలో ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మించేందుకు 941 వర్మీ నాడెప్ యూనిట్లకు రూ. 1.04 కోట్లతో ప్రతిపాదనలు చేయగా నాటి టీడీపీ ప్రభుత్వం 894 యూనిట్లను మంజూరు చేసింది. వీటి నిర్మాణానికి రూ. 99.84 లక్షలు కేటాయించింది. అయితే వీటిలో సగం పనులు చేయగా, అవి కూడా నాసిరకంగా నిర్మించడంతో ఆ నిధులు టీడీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యుల జేబుల్లోకే వెళ్లిపోయాయి.

తెలుగు తమ్ముళ్లకు కమీషన్లు..

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకంలో మండల వ్యాప్తంగా 5,645 మరుగుదొడ్ల నిర్మాణానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ. 8.46 కోట్లు మంజూరు చేసింది. అయితే మరుగుదొడ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో తెలుగు తమ్ముళ్లు అందినకాడికి దోచుకున్నారు. అలాగే నిర్మాణాలు చేపట్టిన వారి నుంచి కమీషన్లు వసూలు చేశారు.

ఇంకుడు గుంతల నిర్మాణాల్లోనూ చేతివాటం..

2015 - 16లో నాటి టీడీపీ ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలను తెరపైకి తీసుకువచ్చి తెలుగు తమ్ముళ్లకు వేలాది రూపాయిల లబ్ధి చేకూర్చిందని చెప్పొచ్చు. మండలంలో 2000లకు పైగా ఇంకుడు గుంతలు నిర్మాణాలు చేపట్టినట్లు రికార్డుల్లో పొందుపరచగా.. ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 15 వందల వరకు నిధులు మంజూరు చేశారు. వీటిలో అనేక గ్రామాల్లో ఇంకుడు గుంతలు తవ్వకుండానే జన్మభూమి కమిటీలు, అధికార పార్టీ నేతలు జేబులు నింపుకున్నారు.


నాసిరకంగా నిర్మించిన వర్మీసేన నాడెప్ కుండీ(ఫైల్)


స్వచ్ఛభారత్ కార్యక్రమంలో నాసిరకంగా నిర్మించిన మరుగుదొడ్లు(ఫైల్)

క్లుప్తంగా

పైడితల్లి దేవర ఉత్సవం చాటింపు నేడు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం చాటింపు ప్రక్రియను సోమవారం సాయంత్రం 5 గంటలకు మూడులాంతర్లు కూడలిలోని చదురుగుడి వద్ద నిర్వహిస్తామని ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీవీ ప్రసాదరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నిర్వహించబోయే ఉత్సవానికి సంబంధించి ఆలయ ఆవరణలో తలయారీలు చాటింపు వేస్తారన్నారు. భక్తులందరూ అమ్మవారి చాటింపు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

పోలింగ్ బూత్‌ల మార్పు పేరుతో ఫేక్ ఎస్ఎంఎస్‌లు

- సచివాలయాల నుంచి వచ్చిన స్లిప్‌లే కరెక్ట్: డీఆర్‌ఓ అనిత

విజయనగరం అర్బన్: ఓటర్లను గందరగోళానికి గురిచేసే చర్యలతో టీడీపీపై జనం దుమ్మెత్తి పోస్తున్నారు. ఓటర్ పోలింగ్ బూత్ మారిపోయినట్లు ఫేక్ మెసేజ్ (ఎస్ఎంఎస్)లను పంపడంపై మండిపడుతున్నారు. ప్రదీప్ నగర్ కాలనీకి చెందిన పలు కుటుంబాలకు పోలింగ్ కేంద్రం మారిందంటూ మెసేజ్‌లు వచ్చాయి. అంతకు ముందు సచివాలయాలు ఇచ్చిన అధికారిక స్లిప్‌లో స్థానిక ప్రదీప్‌నగర్ ప్రాథమిక పాఠశాల పోలింగ్ కేంద్రంగా ఉంది. ఇంతలోనే పోలింగ్ బూత్ మార్పు ఎందుకు జరిగిందోనని ఆందోళన పడ్డారు. ఆదివారం సాయంత్రం 'సీపీ–టీడీపీఎస్ఎంఎస్' నుంచి అదే సీరియల్ నంబర్, బూత్ నంబర్‌తో గాజులరేగ హైస్కూల్ లోకేషన్‌గా మెసేజ్ వచ్చింది. ఓటర్‌ను కన్ఫ్యూజ్ చేసి ఓటు వేయనీయకుండా టీడీపీ పాల్పడుతోందని స్థానికులు వాపోతున్నారు. బూత్ మార్పు చెందితే అధికారికంగా సచివాలయాల ద్వారానే మెజేస్ వస్తుందని, ఎన్నిక కమిషన్ ద్వారా ఎలాంటి ఎస్ఎంఎస్‌లు రావని డీఆర్‌ఓ ఎస్.డి.అనిత వివరణ ఇచ్చారు. సచివాలయాల ద్వారా వచ్చిన ఓటు స్లిప్‌ను మాత్రమే ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు.

అరసవల్లిలో 'వైశాఖ' సందడి



ఇంద్ర పుష్కరిణి వద్ద సంప్రదాయ పూజలు



ప్రత్యేక దర్శన మార్గంలో భక్తుల రద్దీ

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో వైశాఖ మాసం సందడి ప్రారంభమైంది. తొలి ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు కుటుంబాలతో తరలివచ్చి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయంగా వస్తున్న తొలి పంట ఫలాలను, మామిడి పండ్లు, చలిమిడి, బెల్లం, పెసల మొలకలు, గోధుమ ప్రసాదాలను ఆదిత్యునికి నివేదించి ప్రత్యేకంగా మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సర్వదర్శనాలకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ చర్యలు చేపట్టగా.. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో ఎస్.చంద్రశేఖర్ చర్యలు చేపట్టారు. ఒక్కరోజులో వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.3,74,300, పూజలు, విరాళాల ద్వారా రూ.67,036, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.85 లక్షల వరకు ఆదాయం లభించినట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు.

ఊరూరా సేవా కేంద్రాలు



రామభద్రపురం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలు

సచివాలయ వ్యవస్థతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సిద్ధింపజేసింది. ఊరూరా సేవా నిలయాలను నిర్మించింది. ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తెచ్చింది. దీనికి రామభద్రపురంలో ప్రజలకు అనునిత్యం కనిపిస్తున్న సేవా భవనాలే నిలువెత్తు నిదర్శనం. తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాశాఖ, వ్యవసాయశాఖ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, ఉపాధి హామీ, వైఎస్సార్ క్రాంతి పథం, భవిత కేంద్రం, పోస్టాఫీసు తదితర కార్యాలయాలన్నీ ఒకేచోట ఏర్పాటుచేయడంతో ప్రజలకు వ్యయప్రయాసలు తప్పుతున్నాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన సచివాయం–2,3, ఆర్‌బీకే–2,3 భవనాలు కూడా ఆ ప్రాంగణంలోనే ఏర్పాటు చేయడంతో మండల కేంద్రం ప్రజలకు పనులు మరింత సులభతరమయ్యాయి. ప్రభుత్వ కార్యాలయాలన్నీ ఒకే ప్రాంగణంలో ఉండడంతో ప్రజలకు సమయం, ధనం ఆదా అవుతోంది.

– రామభద్రపురం

క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహం

- గ్రామస్థాయి క్రీడాకారులకు ప్రోత్సాహం
- ఊరూరా ఆటల పండగ నిర్వహించిన ప్రభుత్వం
- మట్టిలో మాణిక్యాలను వెలికితీత

అంతర్జాతీయ ఆటల పోటీల్లో అమెరికా, చైనా, జపాన్ తదితర దేశాలు దశాబ్దాలుగా పతకాల పట్టికలో ఆధిపత్యం సాధిస్తూ వస్తున్నాయి. దీనికి ఆయా దేశాలు అందిస్తున్న క్రీడా ప్రోత్సాహం.. క్రీడా అవకాశాలు.. క్రీడాకారుల కఠోర సాధనే కారణం. అదే స్ఫూర్తితో ఏపీ ప్రభుత్వం ఆటల యజ్ఞాన్ని గతేడాది డిసెంబర్‌లో ఆరంభించింది. గ్రామీణ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు 47 రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహించి.. మట్టిలో మాణిక్యాలను వెలికితీసే క్రతువును నిర్విఘ్నంగా కొనసాగించింది.

విజయనగరం:

ఏదైనా ఒక రంగంలో రాణించాలంటే చక్కని ప్రణాళిక కావాలి. దాని అమలుకు అవసరమైన అవకాశాలు సృష్టించాలి. పటిష్ట కార్యాచరణ ప్రణాళికతో... భవిష్యత్తును అంచనా వేస్తూ ముందుకు సాగాలి. అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ దిశగానే పయనిస్తోంది. ఏ రంగాన్ని తీసుకున్నా స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామికం, పర్యాటకం, క్రీడాలు ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధిస్తోంది. దీనికోసం పటిష్ఠ ప్రణాళికలు వేస్తూ నిరంతరం శ్రమిస్తోంది. మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యా, ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునేలా ఇప్పటికే ఒకటో తరగతి నుంచి ఆంగ్ల విద్యావిధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇప్పుడు క్రీడల్లోనూ ప్రోత్సహిస్తోంది.

సమస్తం సమకూర్చుతూ...

రాష్ట్రవ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రభుత్వం తలపెట్టి నిర్విఘ్నంగా నిర్వహించింది. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు దశల్లో... ఐదు క్రీడాంశాల్లో 47 రోజుల పాటు సాగే ఆటల సంబరానికి క్రీడాకారుల పేర్లు నమోదు... రిఫరీల ఎంపిక... పీడీలు, పీఈటీల నియామకం.. మైదానాలు సిద్ధం చేయడం.. క్రీడాకారులకు కావాల్సిన సమస్త ఆటసామగ్రి సమకూర్చడం... విజేతలకు బహుమతుల ప్రదానం... ఇలా.. అన్నింటా ఎక్కడా రాజీపడకుండా పక్కాగా ఏర్పాట్లు చేసింది. దీనివెనుక ప్రభుత్వ లక్ష్యం ఒక్కటే.... క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడం... వారి ప్రతిభకు పదును పెట్టడం.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో మన రాష్ట్ర విద్యార్థులు పతకాల పంటపండిచేలా తీర్చిదిద్దడం... ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం. దీనికోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు సాగుతోంది. ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా విషం కక్కుతున్నా లక్ష్యసాధన కోసం నిరంతరాయంగా శ్రమిస్తోంది. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికార యంత్రాంగం క్రీడా యజ్ఞాన్ని ముందుకు సాగించింది. క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించింది బహుమతులతో అభినందించింది.



ఖోఖో పోటీల్లో తలపడుతున్న బాలికలు (ఫైల్)

విజేతలకు బహుమతుల ప్రదానం ఇలా...

ఆడుదాం ఆంధ్రా పోటీల్లో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో విభాగాల్లోని విజేతలకు ప్రభుత్వం బహుమతులు అందజేసింది. నియోజకవర్గ స్థాయిలోని విజేతలకు వరుసగా రూ.35వేలు, రూ.15వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు వరుసగా రూ.60వేలు, రూ.30వేలు, రూ.10వేలు, రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5లక్షలు, రూ.3లక్షలు, రూ.2లక్షలు అందజేసింది. బ్యాడ్మింటన్ విభాగంలో విజేతలకు నియోజకవర్గ స్థాయిలో మొదటి ముగ్గురికి రూ.20వేలు, రూ. 10వేలు, రూ.5వేలు, జిల్లా స్థాయి విజేతలకు రూ. 35వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రాష్ట్రస్థాయి విజేతలకు వరుసగా రూ.2లక్షలు, రూ.లక్ష, రూ.50 వేలు చొప్పున నగదు బహుమతులు అందజేసింది. గతంలో ఏ ప్రభుత్వమూ తలపెట్టని విధంగా క్రీడల్లో ప్రోత్సహించింది.

పోటీల తీరు ఇలా..			
జిల్లా	సచివాలయాలు	మైదానాలు	క్రీడాకారులు
విజయనగరం	626	346	1.42లక్షల మంది
పార్వతీపురం మన్యం జిల్లా	350	139	65,905



ప్రభుత్వం సరఫరా చేసిన ఆట పరికరాలు



సర్కారు బడిలో.. డిజిటల్ విద్య

- 3, 4, 5 తరగతి విద్యార్థులకు 'స్మార్ట్' బోధన
- ఐఎఫ్‌పీఎస్ టీవీలతో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు విద్య
- 8వ తరగతి దాటిన విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు
- జిల్లాలో తొలివిడత 221 పాఠశాలలకు 928 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్‌టీవీలు
- రెండోవిడత 336 పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్‌టీవీలు
- 8వ తరగతి విద్యార్థులకు తొలివిడతలో 8,183, రెండో విడతలో 9,874 ట్యాబ్‌లు

పార్వతీపురంటౌన్:

కాలం మారింది. విద్యారంగంలో సాంకేతిక విప్లవం కొత్తపుంతలు తొక్కుతోంది. సాంకేతికతను సర్కారు బడుల పిల్లలకు చేర్చడంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సఫలీకృతమైంది. డిజిటల్ విద్యను అందుబాటులోకి తెచ్చింది. మొన్నటివరకు తరగతి గదిలో టీచర్లు కేవలం బ్లాక్, గ్రీన్ బోర్డులను ఉపయోగిస్తూ పాఠాలు చెప్పేవారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కార్పొరేట్ బడులకు దీటుగా, అంతకు మించి పూర్తి స్థాయిలో ప్రభుత్వ స్కూళ్లల్లో బోధనా పద్ధతుల్లో సమూల మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే సరైన మౌలిక వసతులు ఉండవనే పరిస్థితి నుంచి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రభుత్వ బడులంటేనే ప్రత్యేకంగా మాట్లాడుకునే రోజులు వచ్చాయి. మనబడి నాడు–నేడు కార్యక్రమంలో కోట్లాది రూపాయలు ఖర్చుచేసి మౌలిక వసతులు కల్పించడం, డిజిటల్ విద్యాబోధనే దీనికి కారణం. ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీ పడేందుకు అవసరమైన విద్యాబోధనకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్, బైజూస్ కంటెంట్‌తో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలను సమకూర్చింది. నిరంతరాయంగా డిజిటల్ విద్యాబోధన అందించేందుకు, సమకాలీన ప్రపంచ పోకడలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు అన్ని పాఠశాలలను డిజిటలైజేషన్ చేస్తున్నారు. దీనికోసం ప్రతి పాఠశాలకు ప్రభుత్వం ఇంటర్నెట్ సదుపాయం కల్పిస్తోంది.


557 స్కూళ్లకు 1801 స్మార్ట్ టీవీలు

జిల్లా వ్యాప్తంగా నాడు–నేడు పనులు చేపట్టిన 557 ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు తొలి, రెండవ విడతల్లో 1801 స్మార్ట్‌టీవీలు, ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలను ప్రభుత్వం అందజేసింది. తొలివిడతలో 221 ప్రాథమిక పాఠశాలలకు 928 ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీలు వచ్చాయి. రెండవ విడతలో 336 పాఠశాలలకు 873 ఐఎఫ్‌పీఎస్ స్మార్ట్ టీవీలను సమకూర్చింది. వీటిపైనే బోధన సాగుతోంది.

బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లు

బైజూస్ కంటెంట్‌తో ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లను ఎనిమిదో తరగతి విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందజేస్తోంది. గతేడాది జిల్లాలోని 8,183 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసింది. దీనికోసం రూ.35.23 కోట్లు ఖర్చు చేసింది.


ఎండలకు తట్టుకునేలా ఏర్పాట్లు: కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలింగ్ కేంద్రాల వద్ద ఎండలకు తట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. జిల్లాలోని 2,358 పోలింగ్ స్టేషన్లలో సోమవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల ఓటర్లకు తగినట్టుగా ఏర్పాట్లు చేశామన్నారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, ప్రత్యేక క్యూలు, రవాణా సౌకర్యం కోసం వాహనాలు, సీనియర్ సిటిజన్లు, విజువల్, లోకోమోటివ్ వైకల్యాలు ఉన్న వ్యక్తులు, బలహీనమైన కదలికతో బాధపడుతున్న ఓటర్లకు సహాయం చేయడానికి ఎన్‌సీసీ/ఎన్ఎస్ఎస్ సహాయకులను అన్ని పోలింగ్ స్టేషన్లలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్‌స్టేషన్ల వద్ద టెంట్లు, ఫ్యాన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వైద్య బృందాలు, పారా మెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎండల్లో మహిళా ఓటర్లు తమతో పాటు పిల్లలను పోలింగ్ స్టేషన్లకు తీసుకురావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కమిషన్ ఆమోదించిన ఏదైనా గుర్తింపు కార్డుతో పాటు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు ఓటు వేయాలని సూచించారు.

ఉమ్మడి విజయనగరంలో.. పారిశ్రామిక ప్రగతి

- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం
- సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలు, రుణాలు, స్థలాల కేటాయింపు
- సింగిల్‌విండో విధానంలో అనుమతులు
- నాలుగేళ్లలో ఉమ్మడి విజయనగరం జిల్లాలో పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటు
- రూ.151.44 కోట్లతో 892 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు
- 4,700 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



విజయనగరం రూరల్:

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు సహజవనరులకు ఆలవాలం. మానవ వనరులకు కొదవలేదు. వీటిని సద్వినియోగం చేసుకుంటూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేవారిని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఐదేళ్లుగా రుణాలు, రాయితీలు అందిస్తూ, స్థలాలు కేటాయిస్తూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అండగా నిలుస్తోంది. సింగిల్ విండో పద్ధతిలో పారిశ్రామిక అనుమతులు మంజూరుచేస్తోంది. ప్రభుత్వ విధానాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాల్లో పారిశ్రామిక ప్రగతి ఊపందుకుంది. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు పెద్ద ఎత్తున ఏర్పాటయ్యాయి. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

ఉపాధి కల్పన

ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో 2019 నుంచి 2023 మధ్య కాలంలో రూ.151.45 కోట్లతో 892 సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. వీటి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక రాయితీలు కల్పించింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి ఏడాది 2019–20 మధ్య కాలంలోనే రూ.19.53 కోట్లతో 77 పరిశ్రమలు ఏర్పాటు కాగా, 2020–21 మధ్య కాలంలో రూ.10.40 కోట్లతో 41 యూనిట్లను మంజూరు చేశారు. అలాగే, 2021–22 మధ్య కాలంలో రూ.37.50 కోట్లతో 81 యూనిట్లు ఏర్పాటుకాగా, 2022–23 మధ్య కాలంలో అత్యధికంగా రూ.74.05 కోట్లతో 548 యూనిట్లను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు ఏర్పాటు చేశారు. 2023–24 సెప్టెంబర్ నెల వరకు రూ.9.98 కోట్లతో 145 యూనిట్లు ఏర్పాటయ్యాయి. వీటిలో 4,700 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్నారు.

ప్రభుత్వ సహకారం మరువలేనిది

రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ ఎంఎస్ఎస్ఈల ఏర్పాటుకు తక్కువ వడ్డీ, రాయితీ రుణాలను అందిస్తోంది. మిల్లెట్ పరిశ్రమ ఏర్పాటుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహాయంతో ప్రభుత్వమే రూ.4.06 కోట్లు గ్రాంట్‌గా మంజూరు చేసింది. దీంతో ఎల్.కోట మండలంలో మహిళా రైతులతోనే చిరుధాన్యాల పరిశ్రమను ఏర్పాటు చేశాం. పరిశ్రమలో 20 మందికి నేరుగా, మరో 5 వేల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. ఏటా 7,600 టన్నుల సామర్థ్యంతో పరిశ్రమను నడుపుతున్నాం. వచ్చే లాభాలను డివిడెండ్ రూపంలో 1500 మంది సభ్యులకు సమానంగా ఇస్తాం.

– కొమ్మోజుల సరస్వతి, సీఈఓ, ఆరోగ్య మిల్లెట్ ప్రొడ్యూసర్ కంపెనీ, ఎల్.కోట మండలం

స్వయం ఉపాధికి ప్రోత్సాహం

మాది విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని పీఎస్ఆర్ కాలనీ. నేను ఎంబీఏ పూర్తి చేసి 2010–18 మధ్య కాలంలో ప్రైవేటు కంపెనీలో మార్కెట్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగం చేశాను. ఉద్యోగం చేసిన అనుభవంతో సొంతంగా ఒక పరిశ్రమ నెలకొల్పాలన్న ఆలోచన కలిగింది. నాలాంటి వారికి ఉపాధి అందించగలనన్న నమ్మకం కలగడంతో ముందుగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అందిస్తుందన్న ప్రోత్సాహకాలు, రాయితీలు విషయాన్ని తెలుసుకుని దరఖాస్తు చేశాను. ప్రభుత్వం రుణం మంజూరు చేయడంతో 2019లో పూసపాటిరేగ మండలంలో రూ.25 లక్షలతో ఆహార ఉత్పత్తుల పరిశ్రమను ఏర్పాటు చేశాను. తొలుత నాతోపాటు కేవలం ఇద్దరు వ్యక్తులే పరిశ్రమలో పనిచేసేవారం. ప్రస్తుతం పరిశ్రమ టర్నోవర్ నెలకు రూ.2.4 కోట్లకు చేరుకుంది. 20 మందికి ఉపాధి కల్పిస్తున్నాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల స్థాపనకు అందిస్తున్న ప్రోత్సాహం, రాయితీలు బాగున్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా పదుల సంఖ్యలో నిరుద్యోగులకు ఉపాధి అందిస్తున్నానన్న ఆనందం కలుగుతోంది.

– డి.ప్రసన్నకుమార్, ఔత్సాహిక పారిశ్రామికవేత్త, ఇండియన్ గ్రాసరీస్ కంపెనీ, పూసపాటిరేగ మండలం

సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు

- పోలింగ్ కేంద్రాల పరిశీలన
- విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్ని

విజయనగరం క్రైమ్: విశాఖ రేంజ్ పరిధిలో విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికలను సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు భద్రతాపరమైన అన్ని చర్యలు చేపట్టామని విశాఖ రేంజ్ డీఐజీ విశాల్‌గున్ని పేర్కొన్నారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎన్నికల భద్రత ఏర్పాట్లను ఆదివారం పర్యవేక్షించారు. అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గత రెండు నెలల్లో ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టి, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు ఎక్కువగా నమోదుచేశామన్నారు. విశాఖ రేంజ్ పరిధిలో 47వేల లీటర్ల ఐడీ లిక్కర్, రూ.4.5 కోట్ల నగదు, 16 కిలోల బంగారం, 113 కిలోల వెండి, రూ.11.5 కోట్ల విలువైన గిఫ్ట్‌లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. రేంజ్ పరిధిలో ఎన్నికల్లో సమస్యలు సృష్టించే అవకాశమున్న ట్రబుల్ మాంగర్స్, రౌడీ షీటర్లను ముందుగా గుర్తించి, 18 వేల మందిని బైండోవర్ చేశామన్నారు. విశాఖ రేంజ్ పరిధిలో 1250 లొకేషన్లను క్రిటికల్‌గా పరిగణించి, ఎన్నిక కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం కేంద్ర బలగాలు, ఇతర భద్రతా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, కేంద్ర బలగాలు, హోంగార్డ్స్‌ను బందోబస్తు, రూట్ మొబైల్స్‌లో వినియోగిస్తున్నామని తెలిపారు.



అధికారులు, సిబ్బందికి దిశా నిర్దేశం చేస్తున్న విశాఖరేంజ్ డీఐజీ విశాల్ గున్ని

వీరితో పాటు ఎన్‌సీసీ, ఎక్స్ ఆర్మీ, ఎన్ఎస్ఎస్, ఉద్యోగ విరమణ చేసిన యూనిఫాం ఉద్యోగుల సేవలను వలంటీర్లుగా వినియోగిస్తున్నామని చెప్పారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు గత మూడు నెలలుగా పోలీసుశాఖ చేస్తున్న కృషి, చర్యలు సత్ఫలితాలిస్తాయన్న నమ్మకం ఉందన్నారు. రాజ్యాంగ బద్ధమైన ఓటు హక్కును ఓటర్లు స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు అన్ని రకాలైన భద్రతా చర్యలను చేపట్టామని చెప్పారు. ఎన్నికలను సజావుగా, శాంతియుతంగా, ఎటువంటి అల్లర్లు జరగకుండా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్, రెవెన్యూ, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక, ట్రాఫిక్ డీఎస్పీ విశ్వనాథ్, ఏఆర్ డీఎస్పీ యూనివర్స్, స్పెషల్ బ్రాంచ్ సీఐలు కేకేవీ విజయనాథ్, ఇ.నరసింహమూర్తి, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ కె.రామారావు, రూరల్ సీఐ ఎం.శ్రీనివాసరావు, డిఐజి లైజన్ ఆఫీసర్ పి.రమణయ్య, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

విజయనగరం పట్టణంలోని కణపాక యూత్ హాస్టల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని, భాష్యం స్కూల్ దగ్గరలోని వినాయక నగర్ మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాలను విశాఖ రేంజ్ డీఐజీ విశాల్ గున్నీ, ఎస్పీ ఎం.దీపిక సందర్శించి భద్రతా ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు.